
సాహిత్యమా? సంగీతమా?

ఇటీవల నండూరి పార్థ సారధి గారు 'వివిధ'కు రాసిన రెండు వ్యాసాలలో ('సంగీతంలో సాహిత్యం ఒక అడుగు వెనకే నడవాలి', 09-08-2021; 'విలంబగాన సౌందర్యం', 25-10-2021) వారు వ్యక్తపరచిన భావాలు వారి వ్యక్తిగతమని భావించవచ్చు. ఈ అభిప్రాయాలను వ్యక్తం చేస్తూ ఆయన ఏ సంగీత విద్వాంసులను గాని, సంగీతంలోని ప్రామాణిక పుస్తకాలను కాని ప్రస్తావించ లేదు.

ఇక్కడ నేను ప్రస్తావిస్తున్న 'దాక్షిణాత్య వాగ్గేయకారులు: దేవీ కృతులు - ప్రాశస్త్యం' గ్రంథాన్ని ద్రావిడ విశ్వవిద్యాలయం వారు ప్రచురించారు (2012లో). డా.డి.సుగుణగారు గ్రంధకర్త. స్వయంగా సంగీత కచేరీలు చేసి, సంగీత బోధన చేసే సుగుణగారు వ్యక్తిగత అనుభవం మేళవించి, ఆధ్యాత్మిక సంగీతంలోని సాహిత్య, సంగీత ప్రాశస్త్యాన్ని వివరించిన గ్రంథం ఇది. ఈ గ్రంథం పార్థసారధి గారి అనేక భావాలకు విరుద్ధంగా విషయ వివరణ చేస్తుంది.

ఉదాహరణకు-"శుద్ధ శాస్త్రీయ సంగీతంలో సాహిత్యానికి ప్రాధాన్యం ఇవ్వడం సంగీతాన్ని అవమానించడమే" అనీ, "సంగీతం స్వయం ప్రకాశం గల కళ. కవిత్వం కూడ అంతే. కాని గానం చేయడానికి ఉద్దేశించిన తాళబద్ధమైన గీతాలు కూడా స్వయం ప్రకాశం కలవి కావు. సంగీతాన్ని ఆశ్రయించనిదే అవి రాణించ లేవు" అనీ అంటారు పార్థసారధిగారు. సుగుణగారి గ్రంథం ఏమంటుందో చూద్దాం: "ప్రాచీన కాలం నుంచి భారతదేశంలో భావాలను, అనుభూతులను పలికించడానికి సంగీతం ఒక అద్భుత మాధ్యమంగా వుంటూ వచ్చింది. కాలక్రమంలో చెప్పే విషయం లోనూ (రచనలోని సాహిత్యము), మాధ్యమంగా ఉన్న సంగీతం లోనూ ఎన్నో మార్పులు వచ్చాయి. సామగానం చేసిన కాలంలో మాధ్యమంగా సంగీతం పరిధి చాలా చిన్నది. చారిత్రక క్రమంలో, భక్తి భావంలో విభిన్న కోణాలు ఏర్పడ్డాయి. శైవ, వైష్ణవ, భక్తి ఉద్యమాలు వచ్చాయి. తత్సంబంధమైన తాత్విక దర్శనాలు ఏర్పడ్డాయి. అదే సందర్భంలో (సమయంలో) సంగీతం కూడ అభివృద్ధి చెందుతూ నిర్దిష్టతను, సున్నితత్వాన్ని, గాఢతను సంతరించుకొంటూ, క్రొత్త రూపాలను ఏర్పరచుకొంటూ ముందుకుసాగింది. వాగ్గేయకారులు కూడా తమ భావాలు సంగీతంలో ఏవిధంగా పలికితే రసిక జనుల హృదయాలను గొప్ప అనుభూతితో నింపగలవో తమ ప్రతిభావ్యుత్పత్తులతో గ్రహించి, అందుకు అనుగుణంగా తమ గీతాలకు సంగీత రచన చేశారు." అంటే భక్తి సాహిత్యానికి, శైవ, వైష్ణవ, ద్వైత, విశిష్టాద్వైత దర్శనాలకు, జీవేశ్వర భేదాన్ని గుర్తించేందుకు, పామరుడు సహా అందరికీ ముక్తి మార్గం, జ్ఞాన మార్గం కలగడానికి సంగీతం ఒక మాధ్యమం అయితే, భక్తి సాహిత్యం మూలపదార్థం అయిందన్నమాట. "అందువల్లనే భక్తి ఉద్యమాలు, భక్తి ఆలంబనగా చేసుకొన్న సంగీతం సమాజాన్ని గాఢంగా, విస్తృతంగా ప్రభావితం చేయగలిగాయి", అంటారు సుగుణ.

ఈ నేపథ్యంలో 'సంగీతంలో సాహిత్యం ఒక అడుగు వెనకే నడవాలి' అన్న వ్యాసంలో రచయిత వ్యక్తం చేసిన భావాలు పైపై విశ్లేషణ కారణంగా వెలుబుచ్చినవేనన్న భావం కలుగుతుంది. పార్థసారధిగారు తన రెండవ వ్యాసం 'విలంబగాన సౌందర్యం'లో త్యాగరాజువారి "నగుమోము గనలేని" కీర్తనను ఉటంకించారు. సంగీతానికి సంబంధించి చేసిన విశ్లేషణలో త్యాగరాజు కృతులను కూడ పరిగణలోకి తీసుకొనటం ద్వారా ఆయన ఆధ్యాత్మిక సంగీతానికి కూడ వర్తించేలానే తన సూత్రీకరణలు చేశారు అన్నమాట.



అయితే వారి ఈ సూత్రీకరణలలో కొంత భిన్నవాదం కనిపిస్తుంది. వారు హిందూస్థానీ, కర్ణాటక సంగీతాలలో హిందూస్థానీ రాగానికి, కర్ణాటక తాళానికి మధ్య పోలిక, భేదాలను చర్చించే నేపథ్యంలో ఈ సూత్రీకరణకు వచ్చినట్లు అవగతమవుతుంది. ఈ సందర్భంగా ఆయన త్యాగరాజు 'నగుమోము' కీర్తనను త్యాగయ్య సినిమా (1946)లో నాగయ్యగారు ఎంతో ఆర్తితో కీర్తించారు అని రాసుకొచ్చారు, దాదాపు త్యాగరాజస్వామి జీవించి ఉంటే వారు కూడ అంతే ఆర్తితో కీర్తించి ఉండేవారన్న అర్థంలో. వాటిలో ఆత్మావలోకనం, వేదన రెండూ వ్యక్తమౌతాయి అని, కాని తర్వాతి కాలంలో అదే కీర్తనను గానంచేసే వారిలో ఆ ఆర్తి, వేదన కచేరిల్లో కనపడవు అంటారు. ఇక్కడే అసలు చిక్కల్లా.

పార్థసారధి వారి తొలి వ్యాసంలో 'సంగీత రచనల్లో సాహిత్యం కేవలం 'టే కాఫ్'కి మాత్రమే ఉద్దేశించినవి అనటం ద్వారా పరస్పర విరుద్ధ సూత్రీకరణలు చేశారా? అనిపిస్తుంది. ఎందుకంటే 'త్యాగరాజు వారి ఈ కృతి తాళబద్ధమైనదే. పార్థసారధి గారి వ్యక్తీకరణ ప్రకారం అది స్వయం ప్రకాశం కలది కాదు. అది సంగీతాన్ని ఆశ్రయించవలసిందే. ఆ విధంగానే సంగీతాన్ని ఆశ్రయించినవారు కచేరిల్లో 'నగుమోము' కీర్తనకు 'టే కాఫ్'కు మాత్రమే వాడుకొన్నారా? అందువల్లనే వారి కచేరిల్లో ఆర్తి, ఆత్మావలోకనం, ఆవేదన మృగ్యమైందా?-వంటి ప్రశ్నలు ఉత్పన్నమవుతాయి. అంతటితో ఆగక, వారు ఆ విధమైన కచేరి లక్షణాలను ముత్తుస్వామి దీక్షితులు నుంచి మంగళంపల్లి బాల మురళీకృష్ణ వరకూ అంతా అలానే పాడే వారు అన్ని సూత్రీకరణ చేశారు.



ఇలాంటి సూత్రీకరణలు పంటి కిందరాళ్ళులా తగలక మానవు. వారు ముత్తుస్వామి దీక్షితులను ఈ గాటను కట్టేయకుండ ఉంటే బావుండేది. ఎందుకంటే ముత్తుస్వామి, త్యాగయ్య సహచరులు. అన్నదమ్ముల్లా ఒకే కాలంలో జీవించారు. త్యాగరాజు ఆర్తిని విస్మరించి ముత్తుస్వామి దీక్షితులు కచేరీల్లో గానం చేశారని పార్థసారధి గారు ఎలా చెప్పగలిగారు.

నిజానికి డి.కె. పట్టమ్మాళ్, ఎం.ఎస్. సుబ్బలక్ష్మి, మంగళంపల్లి బాలమురళీకృష్ణ, మహారాజపురం సంతానం లాంటి వారు పాడిన అనేక త్యాగరాజు స్వామికీర్తనల్లో ఆర్తి, ఆవేదన, ఆత్మావలోకన చాలా ప్రస్ఫుటంగా వ్యక్తమవుతాయి. కొన్ని సందర్భాలలో వినే శ్రోతలో సాత్విక భావాలు పొడచూపి కళ్ళు ఆర్ద్రమవటం కూడ జరుగుతుంది. ఇదంతా సాహిత్య ప్రమేయం లేకుండా కేవలం శుద్ధసంగీతం వలన జరుగుతుందనుకోవటం అతివాదం అవుతుంది.

కొద్దిమంది పార్థసారధిగారు చెప్పినట్లు సంగీత ఆలాపన ప్రారంభం నుంచే పల్లవిని సాగదీసి, వివిధ రకాలుగా స్వరాలపై ఒత్తిడి మారుస్తూ గంటలపాటు ఆలపిస్తారు. కొంతమంది మహ ప్రాజ్ఞులైన సంగీత విద్వాంసులు, రసికులు ఆ ఆలాపనలకు చప్పట్లు కొట్టడం కూడ విదితమే. అయితే ఇది సార్వత్రికంగా, సార్వకాలీన సత్యం కాదు. చాలామంది చప్పట్లు కొడతారన్నది నిజమే అయినా, అంతకంటే ఎక్కువ స్థాయిలో చాలామంది నిద్రలోకి జారుకోవటం, లేక బయటికి వెళ్ళిపోవటం కూడా నిత్య సత్యమే. కీర్తనలోని భక్తిపాలు సాహిత్యం నుంచే ప్రవహిస్తుంది కాబట్టి త్యాగరాజు వంటి వాగ్గేయకారులు పూర్తి కృత్తికి, కీర్తనకి ప్రాధాన్యం ఇస్తూనే పాడారనిపిస్తుంది. అందువలననే అవి సంగీతశాస్త్ర ప్రాజ్ఞులకన్న పామరులకే దగ్గరయినాయి. సాధారణ భక్తులు కూడ తమలో తాము పాడుకొనేలా ప్రాచుర్యం పొందాయి. త్యాగరాజుగారి 'మరుగేలరా రాఘవా', రామదాసుగారి 'నను బ్రోవమని చెప్పవే' - ఈ కోవకు చెందినవే.

ఈ 'దాక్షిణాత్య వాగ్గేయకారులు' గ్రంథంలో దేవీ కృతుల ప్రాశస్త్యంపై చేసిన విశ్లేషణ చూస్తే- వాగ్గేయకారులు రాసిన సాహిత్యం కేవలం సంగీతాలాపనకు 'టేక్ ఆఫ్'కు మాత్రమే పరిమితమైనది కాదని స్పష్టంగా తెలుస్తుంది. ఉదాహరణకు ఉతుక్కాడు వేంకటకవి రచించిన 'కామాక్షి నవావరణ కృతులు' తాంత్రిక అద్వైత దృష్టితో చేసినవే. త్యాగరాజు రాసిన సంగీత నాటకాలు, 'ప్రహ్లాద భక్తి విజయం', 'నౌకాచరితం'లో దాదాపు 600 కృతులు ఉన్నాయి. వీటిలో లలితే శ్రీ ప్రవృద్ధే (రాగం: భైరవి, తాళం: ఆది); 'సుందరి నన్నిందరిలో' (రాగం: బేగడ; తాళం: రూపకం) వంటి దేవీకృతులు ఎంతో ఆధ్యాత్మిక ప్రాధాన్యం కలవి. ఇలా సుగుణ గారు శ్యామాశాస్త్రి, సుబ్బరాయశాస్త్రి, మైసూరు వాసుదేవాచారి, ముత్తయ్య భాగవతార్, మైసూరు సదాశివరావు, చెయ్యూరు చెలంగల్వరాయశాస్త్రి వంటి వారిపై రాసిన దేవీకృతుల విశ్లేషణ చదివితే సంగీతంలో సాహిత్యానికున్న ఆధ్యాత్మిక ప్రాధాన్యత అనన్యమైనదని స్పష్టంగా తెలుస్తుంది. వాటిలో నిక్షిప్తమైన శ్రీచక్ర బీజాలు, కోణాలు వెలుగుచూస్తాయి.

అద్భుతమైన కంఠమాధుర్యం, సంగీత ప్రావీణ్యం ఉన్నవారెవరైనా 'రామునితోక పివరుండిట్లనియే' అని గానం చేస్తుంటే, సంగీత రంజకత్వం సంగతి దేవుడెరుగు శ్రోతలకు వెగటు పుడుతుంది. ముఖ్యంగా తెలుగు సాహిత్యంలో ప్రాథమిక స్థాయి పరిజ్ఞానం లేని తమిళ నేపథ్యంలో ఎదిగిన శాస్త్రీయ సంగీత విద్వాంసులు చాలామంది ఇలా వికటంగా పాడుతూంటారు. సంగీతాన్ని సాహిత్యంతో సమతూకంగా వినాలనుకొనే రసజ్ఞులైన శ్రోతలకు అదో 'హింసాగానమే' అవుతుంది.

■ కొప్పరపు నారాయణమూర్తి